సాక్షి తిరుపతి

మంగళవారం ; 10 ; జనవరి ; 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,990
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,180
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,700
రిటైల్ వెండి గ్రాము	రూ.72.70

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	29	16
చిత్తూరు	29	15
తిరుమల	25	12
గూడూరు	29	18
నగరి	30	17

వినాయకుని వెండి విగ్రహం వితరణ



కాణిపాకం(యాదమరి): తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన అనిల్‌కుమార్ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి వెండి విగ్రహాన్ని వితరణ చేశారు.

న్యూస్‌రీల్

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 75 అర్జీలు రాగా ఇందులో అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 49 వచ్చినట్టు ఆయన వెల్లడించారు.

స్పందనకు 60 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 55 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపైనే ఎక్కువగా ఫిర్యాదులు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. వాటన్నింటినీ వెంటనే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

బాధ్యతల స్వీకరణ



ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజారెడ్డి

తిరుచానూరు: శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా కే.రాజారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహిళా వర్సిటీ వీసీ దువ్వూరు జమున పదవీకాలం ఈనెల 7వ తేదీతో ముగియడంతో ఆమె స్థానంలో ఎస్వీయూ వీసీ రాజారెడ్డిని ఇన్‌చార్జ్ వీసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో పూర్వ వీసీ దువ్వూరి జమున నుంచి ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజిని, వివిధ విభాగాల అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, డెప్యూటీ రిజిస్ట్రార్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, ఎస్‌పీఎంవీవీ టీచర్స్ అసోసియేషన్ వీసీని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

రాక్షస కాండ!



14 ఏళ్ల అధికార మదంతో టీడీపీ నేతలు పేట్రేగిపోయారు. అవసరాలను అవకాశంగా చేసుకుని ప్రజలను ముప్పుతిప్పలకు గురిచేశారు. ఇప్పుడు వీటన్నింటికీ చెక్ పడడంతో ఏంచేయాలో దిక్కుతోచక వికృతచేష్టలకు ఒడిగడుతున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పల్లెబాటను అడ్డుకునేందుకు అడుగడుగునా కుట్రలు పన్నుతున్నారు. తమ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందనే భయంతో పచ్చనిపల్లెల్లో నిప్పురాజేసి రాక్షస క్రీడకు ఆజ్యం పోస్తున్నారు. అభిమానంతో ఏర్పాటు చేసుకున్న బ్యానర్లు, ఫ్లెక్సీలను చించివేస్తూ అరాచకాలు సృష్టిస్తున్నారు. అడ్డుకున్న కార్యకర్తలు, ప్రజలపై పిడిగుద్దులు కురిపిస్తున్నారు. హాకీ స్టిక్‌లు, రాళ్లతో దాడులు చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీనిపై నియోజకవర్గ ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- పుంగనూరులో తారస్థాయికి చేరిన టీడీపీ ఆగడాలు
- ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో చిచ్చురేపుతున్న తమ్ముళ్లు
- మంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుటుంబమే లక్ష్యంగా దాడులు
- పల్లెబాట అడ్డుకునేందుకు అడుగడుగునా కుట్రలు
- విస్తుపోతున్న నియోజకవర్గ ప్రజలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు అలజడి సృష్టిస్తున్నారు. ఆ నియోజకవర్గంలో తమ పార్టీ తుడిచిపెట్టుకుపోతోందన్న అక్కసుతో దాడులకు తెగబడుతున్నారు. ఏంచేయాలో దిక్కుతోచక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలు చించివేస్తూ రాక్షసానందం పొందుతున్నారు. అడ్డుకుంటున్న కార్యకర్తలు, ప్రజలపై విచక్షణారహితంగా దాడులు చేస్తూ రచ్చకీడుస్తున్నారు. తర్వాత వాటన్నింటినీ ప్రభుత్వం, మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై నెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమకు అనుకూలమైన పత్రికలు, మీడియాలో అసత్యకథనాలు వళ్లిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారు.



చికిత్స పొందుతున్న రాజారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి (ఫైల్)

దాడులు ఎందుకంటే..

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వెనుకబడిన ప్రాంతాల్లో పుంగనూరు నియోజకవర్గం కూడా ఉంది. 14 ఏళ్ల టీడీపీ పాలనలో అభివృద్ధి అటకెక్కింది. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లు తదితర వాటిని టీడీపీ కార్యకర్తకో, వారి కుటుంబ సభ్యులకో మంజూరు చేయడం రివాజుగా మారేది. లేదంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిప్పడం.. ఆపై మొండిచెయ్యి చూపడం అలవాటుగా తయారైంది. ఆ పార్టీ నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలకే రోడ్లు, ఇతర పథకాలు మంజూరు చేయించేది. ఇప్పుడు ఆ పరిస్థితిలేదు. 2019 సాధారణ ఎన్నికల తరువాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా రాష్ట్రమంతా సంక్షేమ పాలన మొదలైంది. ఈ నేపథ్యంలోనే సీఎం వైఎస్ జగన్ పాలనకు మెచ్చి పుంగనూరు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీకి జై కొడుతున్నారు. ఆయన అనేక మందికి తనవంతు సాయం చేస్తుండడంతో ఆ నియోజకవర్గ పరిధిలో టీడీపీకి అనుకూలంగా ఉన్న గ్రామాలు సైతం వైఎస్సార్‌సీపీ జెండా కిందకు వస్తున్నాయి. ప్రస్తుతం పల్లెబాట పేరుతో ఊరూరా తిరుగుతున్న మంత్రికి అనూహ్య స్పందన లభిస్తుండడంతో.. నియోజకవర్గంలో అక్కడక్కడా మిగిలిపోయిన టీడీపీ నేతలు సైతం వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకుంటున్నారు. మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. దీన్ని జీర్ణించుకోలేక టీడీపీ మూకలు దాడులకు తెగబడుతున్నాయి.

రెచ్చిపోతున్న తమ్ముళ్లు

మంత్రి పెద్దిరెడ్డి పల్లెబాట నేపథ్యంలో రొంపిచర్ల మండలంలోని బొమ్మయ్యగారిపల్లె, పెద్దగొట్టిగల్లు, బోడిపాటివారిపల్లెకు చెందిన టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. దీన్ని జీర్ణించుకోలేక టీడీపీ మూకలు దాడులకు తెగబడ్డాయి. రెండు రోజుల క్రితం రొంపిచెర్ల క్రాస్‌లో వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలను చించివేశారు. అంతకుముందు చౌడేపల్లి మండలం, గడ్డంవారిపల్లె పంచాయతీ, తెల్లనీళ్లపల్లిలో ఈనెల 1వ తేదీ రాత్రి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి (చిట్టి), అతని అనుచరులు కలిసి ఎంపీటీసీ శ్రీరాములును చితకబాదారు. ఆ గ్రామంలో బ్యానర్లు కట్టకూడదని దౌర్జన్యానికి దిగారు. అదేవిధంగా దిగువపల్లె పంచాయతీ భవానీనగర్‌లో ఈనెల 3న భూ విషయమై టీడీపీ వర్గాలు రెండు ఘర్షణకు దిగాయి. దీన్ని వైఎస్సార్‌సీపీకి అంటగడుతూ ఎల్లో మీడియా ద్వారా అసత్య కథనాలు రాయించడం కొసమెరుపు.



హాకీ స్టిక్‌లతో టీడీపీ శ్రేణుల వీరంగం (ఫైల్)

బరితెగిస్తూ.. నియోజకవర్గంలో 'చల్లా'యిస్తూ..

ఇటీవల టీడీపీ నియోజకవర్గ నేత చల్లా బాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు 'ఇదేంఖర్మ' కార్యక్రమాన్ని చేపట్టారు. పీలేరు, కలికిరి నుంచి ర్యాలీగా గత శుక్రవారం సోమల మండలానికి చేరుకున్నారు. పెద్ద ఉప్పరపల్లి మీదుగా సోమల దళితవాడకు చేరుకున్న టీడీపీ ర్యాలీని స్థానికులు అడ్డుకున్నారు. 'టీడీపీ ప్రభుత్వంలో మాకేం చేశారు..'అంటూ ఎదురుతిరిగారు. తమ గ్రామంపై ర్యాలీ చేయడానికి వీల్లేదంటూ దళితులు రోడ్డుపై బైఠాయించారు. ఈ పరిణామాన్ని జీర్ణియించుకోలేని టీడీపీ శ్రేణులు వికృతచేష్టలకు దిగారు. అడ్డుతప్పుకోకపోతే వాహనాలతో తొక్కిస్తామంటూ బెదిరింపులకు దిగారు. ఈ నేపథ్యంలోనే స్థానికులకు, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సహించలేని టీడీపీ శ్రేణులు స్థానికులపై హాకీ స్టిక్స్, రాళ్లతో దాడిచేశారు. వీరి గొడవను ఆపేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పీఎల్ఆర్ రాజారెడ్డిపై రెచ్చిపోయారు. ఆయన కాలు, చేయిని విరగ్గొట్టి పంతం నెగ్గించుకున్నారు. చివరకు సోమల ఎస్ఐ లక్ష్మీకాంత్‌పైనా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

బంగారు తాపడం పనులు ప్రారంభం



అమ్మవారి విగ్రహంతో ఎంపీ వేమిరెడ్డి దంపతులు

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ విమానగోపురానికి బంగారు తాపడం పనులు ప్రారంభమయ్యాయి. దాతలు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతిరెడ్డి దంపతులు సోమవారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు తాపడం చేయడానికి తయారు చేసిన అచ్చులు, అమ్మవారి విగ్రహాలు, సింహాలు ఇతర వస్తువుల గోపురానికి అంటించి పనులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం దాతలు మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి బంగారు తాపడం చేయించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. ఈ పనులను పూర్తి చేసిన వెంటనే ఫిబ్రవరి 22, 23, 24 తేదీలలో కుంభాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అదే రోజున లక్ష కుంకుమార్చన ఉంటుందన్నారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ జూన్ మొదటివారం అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఉభయకర్తలు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు

జగనన్నది గొప్ప విజన్

నగరి: సచివాలయ వ్యవస్థను దేశవ్యాప్తంగా తీసుకురావాలని చూస్తుండడం సీఎం వైఎస్ జగనన్న గొప్ప విజన్‌కి నిదర్శనమని పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం విజయపురం మండలం, కాళికాపురం గ్రామంలో కేక్‌కట్ చేసి శ్రేణులకు పంచిపెట్టారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజల కోసం జగనన్న చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర నాలుగేళ్లు పూర్తిచేసుకుని ఐదో సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. పాదయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకుని ఒక మేనిఫెస్టోని సిద్ధం చేయడమే కాకుండా వంద శాతం హామీలు పూర్తిచేసిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే అని తెలిపారు. గతంలో చంద్రబాబునాయుడు ఎండలో తిరగకుండా దొంగలు దూరే సమయానికి పాదయాత్ర చేసి తను ఇచ్చిన మేనిఫెస్టోలో కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా సక్రమంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ కలిసికట్టుగా వచ్చినా జగనన్న చిటికన వేలు కూడా కదిలించలేరని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రోజా

• ఇది నడుస్తున్న చరిత్ర!



ప్రజాసంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం తిరుపతిలో సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ తదితరుల ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. – తిరుపతి మంగళం

ప్రజాసంకల్పయాత్ర చరిత్రాత్మకం

సదుం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర చరిత్రాత్మకమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రజాసంకల్పయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సదుంలో సోమవారం నేతాజీ, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 341 రోజుల పాటు 3,648 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారని తెలిపారు. వాటిని మేనిఫెస్టోలో చేర్చి నవరత్నాల పథకాలుగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ యల్లప్ప, వల్లివేడు పృథ్వీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్, నేతాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

మీ ఇద్దరిలో సీఎం అభ్యర్థి ఎవరు?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి

- చంద్రబాబు, పవన్‌కు ఎంపీ మిథున్ రెడ్డి సూటి ప్రశ్న
- రాజకీయం అంటే సినిమా కాదు
- పవన్‌షోతో బాబుకు ఓట్లు వేయరు

పుంగనూరు: చంద్రబాబు.. పవన్‌కల్యాణ్.. ఇద్దరిలో ఎవరు సీఎం అభ్యర్థి అనేది ప్రజలకు స్పష్టం చేయాలని లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం పుంగనూరు మున్సిపాలిటీలో ఎంపీ రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఎం అభ్యర్థిగా చెప్పుకునే జనసేన నాయకుడు పవన్ కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబుతో జతకట్టడం సిద్ధాంతాలు లేకపోవడమేనన్నారు. స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు ఎత్తుగడలు, పవన్‌కల్యాణ్ అభిమానులను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయన్నారు. పవన్ కల్యాణ్ షోలతో చంద్రబాబుకు జనం ఓట్లు వేయరన్నారు. రాజకీయం సినిమా కాదని.. కాపుల ఓట్ల కోసం చంద్రబాబు వల విసురుతున్నాని చెప్పారు. 2019లో వారిద్దరూ జతకట్టి, కాపుల ఓట్ల కోసం డ్రామాలాడి అభ్యర్థులను నిలబెట్టారని ఎంపీ ఆరోపించారు. రాష్ట్రంలో బాబు, ఆయన దత్త పుత్రుడు ఒక్కటైనా వారికి ఓట్లు పడవని, వారికి తగిన గుణపాఠం నేర్పుతారని స్పష్టంచేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని వారు ఆర్భాటాలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించడమేనన్నారు. చంద్రబాబునాయుడు సభలు, ర్యాలీల్లో అమాయకులను బలిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కుప్పం సభకు ఆయన అనుమతి తీసుకోకపోవడం చట్టాన్ని అతిక్రమించడమేనన్నారు. చట్టాన్ని గౌరవించలేని వారు సమాజాన్ని ఏవిధంగా పాలిస్తారని నిలదీశారు. సభలు, రోడ్ షోల నిర్వహణపై ఇచ్చిన జీవోను వాళ్లిదరూ చదవాలని సూచించారు. చిరంజీవి, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్ కూడా సినిమా ఈవెంట్లు అనుమతి పొంది నిర్వహించారని తెలియజేశారు. కుప్పంలో చంద్రబాబు నకిలీ పేషెంట్లకు ఆస్పత్రిలో చికిత్సలు చేయించి షో చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు గుర్తించి ఓట్లు వేయమని కోరుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు దుర్గానగర్ కాలనీలోని బాలమురళి ఇంట్లో దుండగులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. 42 గ్రాముల బంగారు, వంద గ్రాముల వెండి ఆభరణాలు చోరీ చేశారు.

హామీలు వందశాతం అమలు

- వైఎస్సార్ సీపీపై ప్రజలకు నమ్మకం ఉంది
- మళ్లీ జగనే సీఎం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం సదుం మండలంలో పల్లెబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నికల వచ్చే సమయంలోనే సంక్షేమ పథకాలు అమలుచేసేవన్నారు. ఎన్నికలలోపు హామీలను వంద శాతం అమలు చేసే పరిస్థితి తీసుకువచ్చింది సీఎం జగన్ మాత్రమేనని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ హామీ ఇస్తే కచ్చితంగా అమలుచేస్తుందని బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు మేనిఫెస్టోలోని హామీలు ఏ మాత్రం అమలయ్యాయో అందరికీ తెలుసన్నారు. ప్రతిపక్షాలు తమ ఉనికి కోసం పడరాని పాట్లు పడుతున్నాయని విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీకి ఘన విజయం కట్టబెట్టనున్నారని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ యల్లప్ప, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



సదుం: రెడ్డివారిపల్లెలో మంత్రి పెద్దిరెడ్డికి హారతులు పట్టి ఆత్మీయంగా స్వాగతిస్తున్న మహిళలు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి పలువురి చేరిక

సదుం/గుడుపల్లె: సదుం, గుడుపల్లె మండలాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సదుం మండలంలోని గూబలవారిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు రాజేంద్ర, తులసీ, రఘు, నరేష్ తదితరులు సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా గుడుపల్లె మండలం యామగానిపల్లె టీడీపీ మాజీ ఎంపీటీసీ సరోజమ్మ, కుప్పిగానిపల్లెకు చెందిన 50 కుటుంబాల వారు ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గుడుపల్లెలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణమూర్తి, సర్పంచ్ శ్రీనివాసులు, సింగిల్‌విండో చైర్మన్ పత్రాల మునిరత్నం, నాగభూషణం, నియోజకవర్గ యూత్ రవి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులతో మంత్రి పెద్దిరెడ్డి

బెస్ట్ ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యులకు సన్మానం

తిరుపతి అర్బన్: రాష్ట్రస్థాయిలో బెస్ట్ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ డాక్టర్స్‌గా ఎన్నికైన తిరుపతికి చెందిన ఐదుగురు వైద్యులను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీ, డీఎంహెచ్‌ఓ శ్రీహరి సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. సన్మానం అందుకున్నవారిలో తిరుపతి జిల్లాలోని పెళ్లకూరు చావలి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.సుజాత, పిచ్చాటూరు వెంగళత్తూర్ పీహెచ్‌సీ డాక్టర్ బీ.గాయత్రి, దొరవారిసత్రం పోలిరెడ్డిపాళ్యం పీహెచ్‌సీ డాక్టర్ ఎం.పద్మావతి, చిల్లకూరు ఎన్‌ఆర్‌పల్లి పీహెచ్‌సీ డాక్టర్ భావనారాయణ, చెంబేడు కన్నూరు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి ఉన్నారు.



డాక్టర్లను సన్మానిస్తున్న కలెక్టర్, జేసీ, డీఎంహెచ్‌ఓ

అభ్యంతరాలు తెలపండి

తిరుపతి అర్బన్: ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీల నేతలు చెప్పవచ్చని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో రాజకీయ పార్టీలు సూచించిన అభ్యతరాలను జాయింట్ కలెక్టర్ డీకే.బాలాజీ అధ్యక్షతన కమిటీ వేసి అర్హతలేని గ్రాడ్యుయేట్ ఓటర్లను 3,297 మందిని గుర్తించి తొలగించామన్నారు. ఉపాధ్యాయ ఓటర్లుగా నమోదుచేసుకున్న వారు డీఈఓ ధ్రువీకరణ చేసినవని, అయినప్పటికీ మరోమారు పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తామని వెల్లడించారు. సమావేశంలో తిరుపతి నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి, డీఆర్వో శ్రీనివాసరావు, ఆర్డీఓ కనకనరసారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఎన్నికల సూపరింటెండెంట్ పరమేశ్వరస్వామి, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలు ప్రమీలమ్మ, వెంకటనరసింహులు, కందారపు మురళి, మనోహరాచారి, మురళి, వరప్రసాద్, ఎన్నికల డీటీ విజయభాస్కర్ పాల్గొన్నారు.

తెలుగు భాషపై మక్కువ పెరగాలి



జాతీయ స్మారక పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

పలమనేరు: నేటి తరం విద్యార్థుల్లో తెలుగు భాషపై మక్కువ తగ్గుతోందని, ఇది భవిష్యత్తుకు మంచిది కాదని ప్రముఖ శతావధాని ఆముదాల మురళి తెలిపారు. పలమనేరు సమీపంలోని కళామందిరంలో సోమవారం స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు ఆధ్వర్యంలో జాతీయ స్మారక పురస్కారాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, కళలు, సంస్కృతిని కాపాడుకునేందుకు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి లాంటి సంస్థలు గట్టిగా కృషిచేయాలని సూచించారు. అనంతరం ప్రముఖ కథా రచయిత పేరూరు బాల సుబ్రమణ్యంకు పైనేని చిన్నబుచ్చినాయుడు జాతీయ స్మారక పురస్కారం, కొలమాసనపల్లికి చెందిన తర్నారెడ్డి, గంగిరెడ్డి దంపతులకు నాగమణెమ్మ పురస్కారం, శ్రీపురం సీతారామయ్యకు సేగు సుభద్రమ్మ పురస్కారం, ఆముదాల మురళికి బసయ్య పురస్కారం, నాగ శివప్రసాద్‌కు రాజన్న పురస్కారం, భాగవతారిణి జయశ్రీకి దండపల్లి క్రిష్ణప్ప పురస్కారం అందజేశారు. సంఘం కార్యదర్శి పుష్ప, ఎల్లంపల్లి నరేంద్ర, చంద్రశేఖరయ్య, గురుమూర్తి, నరసింహులు శెట్టి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువు ఆగిపోకూడదని..

- ఎమ్మెల్యే రూ.40 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ఓ పేద విద్యార్థిని చదువు ఆగిపోకూడదని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి భావించారు. ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచారు. శ్రీకాళహస్తి పట్టణం, ఏఎంపుత్తూరుకు చెందిన సాయిలీలా నెల్లూరులోని పద్మావతి నర్సింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతోంది. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో కళాశాల ఫీజు చెల్లించలేని స్థితి. దీంతో సాయిలీలా తండ్రి వసంతరావుగౌడ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కళాశాల యాజమాన్యంతో ఫోన్‌లో సంప్రదించారు. ఆపై రూ.40 వేల ఆర్థిక సాయాన్ని సాయిలీలా తండ్రి వసంతరావ్‌గౌడ్‌కు అందజేశారు. భవిష్యత్‌లో చదువుకు ఎలాంటి సాయం కావాలన్నా చేస్తానని హామీ ఇచ్చారు. కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు చైర్మన్ శెట్టిపల్లి సురేష్, తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ సిరాజ్‌బాషా, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సభ్యుడు బుల్లెట్ జయశ్యామ్, నాయకులు పాల్గొన్నారు.

ఇండియన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వైస్ చైర్మన్‌గా ధనాశి



భాకరాపేట: ఇండియన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటకు చెందిన ప్రముఖ రచయిత్రి ధనాశి ఉషారాణి నియమితులయ్యారు. ఆమేరకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ లీగల్ అడ్వైజర్ అనిల్‌కుమార్‌యాదవ్ నుంచి సోమవారం ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది నుంచి చిత్తూరు జిల్లా అధ్యక్షురాలిగా పనిచేశానన్నారు. సంస్థను అన్ని రకాలుగా ముందుకు తీసుకుపోవడం ద్వారా రాష్ట్రస్థాయిలో పనిచేయడానికి అవకాశం కల్పించారని చెప్పారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు.

నీటి సంపులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రేణిగుంట: తూకివాకం గ్రామ సమీపంలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో నిర్మితమవుతున్న ఇంటి నీటి సంపులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు గాజులమండ్యం ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు. తూకివాకం గ్రామ శివారున ప్రైవేటు వెంచర్‌లో నిర్మిస్తున్న ఓ ఇంటి పనులు వారం రోజులుగా నిలిపేసి ఉన్నారు. వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి సోమవారం శుభ్రం చేసేందుకు సంపులోనికి దిగేందుకు ప్రయత్నించగా, అందులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. దీంతో విషయాన్ని గాజులమండ్యం పోలీసులకు తెలియజేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. సుమారు 40–45 సంవత్సరాల మధ్య వయస్సు వ్యక్తి మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, అయితే ముఖం గుర్తుపట్టేందుకు వీలు లేకుండా బాగా ఉబ్బిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు ఎవరనేది తెలియరాలేదు. అనుమానాస్పద మృతిగా భావించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ధనుర్మాసం ప్రత్యేక యాత్రలు



ప్యాకేజీ టూర్‌కు వచ్చిన భక్తులతో గిరిధర్

తిరుపతి అలిపిరి: ధనుర్మాసం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక యాత్ర చేపడుతున్నట్లు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ తిరుపతి డివిజనల్ మేనేజర్ యం.గిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు పరిసర ప్రాంత జిల్లాలకు యాత్రికులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలతో ఒంటిమిట్ట, గండి క్షేత్రం ప్రత్యేక టూర్‌లను ధనుర్మాసంలో తిరుపతి నుంచి నాన్ ఏసీ బస్సులు విజయవంతంగా నడుపుతున్నామన్నారు. ఈ ప్యాకేజీ టూర్‌లో ప్రయాణించిన యాత్రికులందరూ పర్యాటక సంస్థ ఏర్పాటు చేసిన అతి తక్కువ ధర, రవాణా సదుపాయాల పట్ల ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. యాత్రలు చివరి తేదీలు ఈనెల 14, 15 లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్యాన్సర్ రీసెర్చ్ సంస్థతో మహిళా వర్సిటీ ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న మహిళావర్సిటీ, క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ ప్రతినిధులు

తిరుచానూరు: ఎస్వీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ రీసెర్చ్ (స్వీకార్) సెంటర్‌తో కలిసి ఆరోగ్య సంబంధిత సామాజిక కార్యక్రమాలు, పరిశోధనలు చేసేందుకు పద్మావతి మహిళా యూనివర్సిటీ సోమవారం ఒప్పందం చేసుకుంది. ఒప్పందంపై వీసీ దువ్వూరు జమున, రిజిస్ట్రార్ ఎస్.రజిని, స్వీకార్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివకుమార్ హీరేమత్ సంతకాలు చేశారు. మహిళా వర్సిటీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, నర్సింగ్ విద్యార్థులకు క్లినికల్ ట్రైనింగ్ అందించనున్నారు.

బాలుడి ఆత్మహత్య

బంగారుపాళెం : మండలంలోని సదకుప్పంలో సోమవారం సాయంత్రం బాలుడు ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన సురేష్ కుమారుడు హేమచెందు(14)కు గ్యాస్ సిలిండర్ తీసిపెట్టాలని రూ.2 వేలు ఇచ్చి కూలి పనులుకు వెళ్లాడు. హేమచందు మిత్రులతో ఆడుకుంటూ నగదు పోగొట్టాడు. తర్వాత తల్లిదండ్రులు ఏమంటారోనని భయపడి ఇంట్లో ఉరివేసుకున్నాడు. బాలుడు అరగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

పురుగుల మందు తాగిన యువతి మృతి

చిత్తూరు అర్బన్: ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువతి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. టూటౌన్ ఎస్‌ఐ మల్లికార్జున కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన రమ్య (21) తల్లిదండ్రులు మృతి చెందడంతో అవ్వ వద్ద ఉంటోంది. ఆమె నర్సింగ్ చేసింది. పలువురి వద్ద అప్పులు తీసుకుంది. డబ్బు తిరిగి చెల్లించాలని వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో ఈ నెల 4వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వలంటీర్ ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం, 11వ డివిజన్ వలంటీర్ శరవణ (32) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పలువురి వద్ద నగదు అప్పు తీసుకొచ్చి తెలిసిన వాళ్లకు ఇచ్చానని, తీరా డబ్బులు ఇవ్వకుండా తనను మోసం చేయడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నాడు. తన చావుకు షేక్ సయ్యద్ అనే వ్యక్తి కారణమంటూ పేర్కొన్న లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

భూకబ్జా కేసులో నిందితునికి జైలు

తడ: ఇతరుల భూమిని ఆక్రమంగా కబ్జాచేసి బాధితులను భయభ్రాంతులకు గురిచేసిన కేసులో నిందితుడికి సూళ్లూరుపేట కోర్టు ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.2,500 జరిమానా విధించింది. ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. 2014లో ఈ కేసుకు సంబంధించి బద్దెపూడి సులోచనమ్మ అనే మహిళ తడ పోలీస్ స్టేషన్‌లో తడకు చెందిన కంద్రిగ ప్రసాద్ అనే వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టి కోర్టుకు నివేదిక అందజేశారు. ఇరువర్గాల వాదనలు విన్న సూళ్లూరుపేట ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అనిల్‌కుమార్ సోమవారం తుది తీర్పు వెలువరించారు.